



# సహచరులు

## ముదిగంటి సుజాతారెడ్డి



"అమ్మా!.... అగో! నాన్న!...." అరిచాడు చంటి కుడిచేయి చాపి చూపిస్తూ.

"నాన్నా!.... ఇక్కడెందుకుంటాడురా. ఆఫీసులో వుంటాడుగాని." అంది సీత భర్త కోసం దిక్కులు చూస్తూ.

"కాదమ్మా! నిజమే!... నాన్నే!.... ఎఱ్ఱ రంగు అంగీ వేసుకున్నాడు. ఎఱ్ఱ రంగు బ్యానరు పట్టుకుని అగో ఆ ఊరేగింపు (ప్రొసెషన్) ముందు నడుస్తున్నాడు."

అప్పటికే ప్రొఫెషన్ ముందుకు వెళ్లిపోయింది. చాలా పొడుగైన లైను కట్టి జనం బ్యానర్లతో జెండాలతో.... రోడ్డు మీద ట్రాఫికంతా స్థంభించిపోయింది. ఎవరూ ఎటూ కదలకుండా వున్నారు.

"చంటీ! ఎవర్ని చూసి నాన్న అనుకున్నావేమోరా!.... నాన్న ఏంటి ఎఱ్ఱ రంగు అంగీ తొడుక్కోవడమేమిటి!... ఆయనెప్పుడూ తెల్ల అంగీయే వేసుకుంటారు. అయినా నీకు తెలియదారా! నాన్న తెల్ల అంగీ వేసుకుంటాడని!... రోజా చూడ్డం లేదా నువ్వు?..." "అదంతా నాకు తెలియదమ్మా! ఎఱ్ఱ రంగు అంగీతో ప్రొసెషన్ ముందర నడుస్తూ నాన్న కన్పించాడు. నాన్నను గుర్తుపట్టలేనాడిని కాను.... ఆ నడిచేది నాన్నే!.... ఆఁ... అంతేగాదు నాన్న ఏదో అరుస్తున్నాడు కూడా!"

"ఛీ! నాన్న అరవడమేమిటిరా!... ఆయనెప్పుడు గట్టిగా మాట్లాడగా చూడలేదు. నోరు విప్పి పెద్దగా మాట్లాడగా ఎప్పుడైనా నువ్వు చూసావా? చెప్పు!...." "చూడలేదనుకో! నాన్న ఎప్పుడూ సీరియస్‌గా వుంటాడు. నాతో కూడా ముక్తసరిగానే మాట్లాడ్తాడు.... ఇంటర్ కదా. ఏ కాలేజీలో చేరావు

అని అడిగాడు. చెప్పాను... అంతే మళ్లీ ఏం అనలేదు. నీతోగాని తాత నానమ్మలతోగాని నాన్న ముచ్చట్లు పెట్టగా నేనెప్పుడూ చూడలేదు. నాన్ననందరూ మితభాషి అని అంటారు..." స్వగతంలో అనుకున్నట్టు అన్నాడు చంటి.

రోడ్డుమీది మంది వాహనాలు గోలలో చంటి మాటలు సీతకు కొన్ని వినిపిస్తున్నాయి. కొన్ని వినిపించడం లేదు.

"చంటీ! ఏం సోదిరా నీది. సరిగ్గా వినిపిస్తలేదు. మీ నాన్న నా పెండ్లినాటి నుంచి చూస్తూనే వున్నాను. తెల్ల అంగీ తప్ప వేరే ఏదీ వేసుకోడు. పెండ్లితో శుభమని... మా నాన్నగారు... అదే మీ తాతగారు పసుపు అద్దినట్లుగా వున్న పసుపుపచ్చ అంగీ.... పట్టు అంగీ కుట్టించారు... కాని మీ నాన్న ఆ అంగీ తొడుక్కోనని... ఆ రంగు తనకిష్టం లేదని మొండికేసాడు. అప్పటికప్పుడు నాన్నగారు తెల్ల అంగీ... రెడీమేడ్ అంగీ తెప్పిస్తే... అది వేసుకున్నాడు. ధోవతి కూడా సరిగ్గా కట్టుకోవడం రాలేదు. మీ నాన్నకు పెళ్లిరోజు..." చిరునవ్వుతో ఆగిపోయింది సీత. ఏవో దృశ్యాలు ఆమె మెదడులో కదిలాయి.

"మరి నాన్న ధోవతి కట్టుకోలేదా?..." అడిగాడు చంటి.

"పెండ్లిలో... లగ్నం పీటల మీద ధోవతి కట్టుకుని కూర్చోవాలని అందరూ బలవంతం చేస్తే అప్పుడు మీ నాన్నకు మా మేనమామ... అదే మనోహర్ తాతయ్య పిన్నులు పెట్టి బెల్టు బిగించి దోవతి కట్టాడు. పెండ్లిలో ఆ దోవతి కాస్సేపు వుంచుకున్నాడంతే మీ నాన్న..." నవ్వింది సీత.

"నీకు ధోవతి కట్టుకోవడం ఇప్పుడే నేర్పాలిరా చంటీ!... లేకపోతే పెండ్లిలో నీకు తిప్పలవుతుంది!" మళ్లీ నవ్వింది సీత.

"ఛీ! పోమ్మా! నేను అస్సలు దోవతి కట్టుకోనే కట్టుకోను..." బుంగమూతి పెట్టాడు చంటి.

"సరే! ఇప్పట్నుంచే ఎందుకు అదంతా." నవ్వింది సీత కొడుకు తనమీద చేయిపెట్టి దువ్వుతూ.

ఆరోజు సాయంత్రం పొద్దుపోయి ఇంటికి వచ్చాడు జానకీ రాములు.


"రోడ్డుమీద చాల ట్రాఫిక్ కదండి. అందుకేనా ఆలస్యమైంది."

"ఊఁ..." నీ కెట్లా తెలుసన్నట్లుగా ప్రశ్నార్థకంగా చూశాడు జానకీరాములు భార్య ముఖంలోకి.

"నేనూ చంటి సాయంత్రం బజారుకు పోయామండి. ఒకవైపు ఏదో పెద్ద ప్రొసెషన్. ఇంకోవైపు కరెంటు పోయిందేమో ట్రాఫిక్ లైట్లు పనిచేయక మొత్తం ట్రాఫిక్ ఆగిపోయింది. అంత ట్రాఫిక్ జామ్ నేనెప్పుడూ చూడలేదు. చౌరస్తాలో గందరగోళం! ఆ జనంలో చంటి మిమ్మల్ని చూశానని అన్నాడు... మీరక్కడ బజార్లో వున్నారా?..." ఏ అనుమానం ధ్వనించలేదు సీత గొంతులో.

"నేనా?... బజార్లోనా?... ఏ టైమ్‌లో..."

"మూడున్నర, నాలుగయిందేమో... చంటి పుస్తకాలు కొంటానంటే కాలేజీ అయ్యాక బయలుదేరాం. ఎర్రరంగు అంగీ వేసుకొని ఎర్ర బ్యానరు పట్టుకుని ప్రొసెషన్ ముందు నడుస్తుండగా చంటి చూశానన్నాడు. అంతలో ట్రాఫిక్ జామ్ చూసి మా రిక్షా అతను




పక్కసందులోకి తిప్పి ఇంటికి చేర్చాడు."

"ఆ టైమ్‌లో మీరక్కడకి ఎందుకు పోయారు!...."

జానకీరాములు గొంతులో కోపం, చిరాకు ధ్వనించాయి. 'ఏమన్నా అయితే!...' వెంటనే ఆతురతను ప్రకటించాడు.

"అవును పోలీసు మీదికి ఎవరో రాళ్లు రువ్వారట. పోలీసులు లాఠీ చార్జీ చేశారట. అప్పటికే మేం ఇంటికి వచ్చేశాం."

"అదే!... ప్రమాదం కదా. ఎందుకు పోయారక్కడికి?..." మెల్లగా గొణిగాడు జానకీరాములు.

"మాకేం తెలుసండి ఈరోజు ఇంత గోల జరుగుతుందని! చంటి పుస్తకాలు కొందామంటే వెళ్లాం."

"కొన్నారా?..."

"కొన్నాం. కొనుక్కుని రిక్షాలో బయలుదేరాం ఎక్కడినుంచో ప్రొసెషన్ వచ్చేసింది. అంతే!... రోడ్డంతా జనం! జనం!... అప్పుడే చంటి మిమ్మల్ని చూశానన్నాడు! మీరు ఎర్రరంగు అంగీ వేసుకున్నారని అంటాడేంటి? పొద్దున్న మీరు తెల్ల అంగీ వేసుకునే పోయారు కదా!... ఇప్పుడు తెల్ల అంగీయే వుంది! మరి! చంటి అట్లా చూశానంటాడేమిటి?" ఆశ్చర్యపోయింది సీత.

"ఎవర్ని చూశాడో వాడు."

"మీరు ఆఫీసుకు పోలేదా!"

"ఏం లేదు. ఎర్రరంగు అంగీ ఎక్కడిదని!..."

"అబ్బా! మళ్లా ఎర్రరంగు అంగీ!..." విసుక్కున్నాడు జానకీరాములు.

"సరే! భోజనానికి రండి." అర్రలో కూర్చుని పుస్తకం చదువుతున్న చంటీని పిలిచింది సీత.

ఓ నెలరోజుల తర్వాత... ఒకటే వర్షాలు. కుండపోతగా వచ్చిపోతే బాగానే వుండును. కాని ఒక్కటే ముసురు. కాస్త ఒరుపు చూసుకుని చంద్ర వచ్చింది. ఆ ముచ్చట్లు ఈ ముచ్చట్లు అయ్యాక--

"సీతా! మీ ఆయన ఏందే? రహస్యం!..." నవ్వింది చంద్ర.

"ఏమైందే మా ఆయనకు..." సీత, చంద్రవైపు కుతూహలంగా చూసింది.

"మొన్న మీ ఆయనను ఏదో సభలో మాట్లాడుతుండగా సుందరయ్య విజ్ఞానభవన్ దగ్గర చూశాను. నేను మారుతీకారులో పోతున్నాను. అప్పటికే ట్రాఫిక్‌జామ్‌తో లేటయ్యింది ఆఫీసుకు. కాస్త వేగంగా నడుపుతున్నాను కారు. బోలెడు జనం సభలో. ఆ జనం మధ్య మీ ఆయన వానజల్లులు. లెక్కచేయకుండా నిలబడి చాలా ఆవేశంగా ఉపన్యాసమిస్తున్నాడే. మీ ఆయన ఉపన్యాసమిస్తాడని ఇంతవరకూ నాకు తెలియదు.

"ఉపన్యాసమిస్తున్నాడా?..." సీత ముఖం తెల్లబోయింది.

"నీకు తెలియదా?...."

"ఊఁ.... ఊఁ.... తెలియదు. ఏం మీటింగో!..." పరధ్యానంగా అంది సీత.

"అదేమిటే! మీ ఆయన నల్లరంగు అంగీవేసుకున్నట్లుగా కనిపించాడు నాకక్కడ!"

"నల్లరంగు అంగా!.... ఆయన తెల్ల అంగీ తప్ప వేరే వేసుకోడే. అందులో నల్లరంగా! ఏం

చూశావో ఏందో!... నీకు తెలుసా!... నల్లరంగు అశుభం అని వేసుకోవడానికి చాలామంది జంకుతారు. ఆయనకు నల్లరంగు అంగీ లేనేలేదు అసలు!" అంది సీత పైకి కొంత స్వగతంగా.

"మరి... నేను ఆరోజు నల్లరంగు అంగీలో మీ ఆయన్ను చూశానే!..." అంది చంద్ర.

"ఎవర్ని చూసి ఎవరనుకున్నావేమోనే!"

"లేదే! మీ ఆయనే. మీ ఆయన్ను నేను గుర్తించకపోవడమేమిటి! మీ ఆయనే... నల్లరంగు అంగీలో... కాని అది నల్లరంగా?... లేక ముదురు ఎరుపురంగా?... నాకు దూరంనుంచి సరిగ్గా కనిపించలేదనుకో..." అనుమానంగా అంది చంద్ర.

"హో!... ఎర్రరంగు అంగా! ఈ మధ్య ఆయన చాలామందికి ఎర్రరంగు అంగీలో కనిపిస్తున్నాడు!..." నవ్వింది సీత పేలవంగా.

"ఓ! అయితే అది ముదురు ఎరుపురంగు అంగీయే.... ఆకాశం మబ్బులు పట్టి గుడ్డిగా వుంది గదా. దూరంనుంచి నాకు నల్లగా కన్పించి వుంటుంది! సరే! నేను వస్తానే!..." చంద్ర వెళ్లిపోయింది.

అసలు చంద్ర ఈ ముసురులో ఈ విషయం చెప్పడానికే పనిగట్టుకుని వచ్చినట్లున్నది... సీత మనస్సంతా సంశయాలతో నిండిపోయింది-- ఈయనేమిటి అంగీలు మార్చడం. మా ముందు ఎప్పుడూ తెల్ల అంగీలో వుండే అతను బయట ఎర్రరంగు అంగీలో తిరగడమేమిటి?... ఎర్రరంగు అంగీ ఎందుకు వేసుకుంటున్నాడు ఇంట్లో వాళ్లకు... నాకూ... చెప్పవచ్చుగదా! మా దగ్గర దాచిపెట్టడమేంది!... ఎర్రరంగు అంగీలు తనకున్నాయని అవి వేసుకుంటానని దాచి పెట్టడం ఎందుకు? ఎర్రరంగు అంగీ వేసుకుంటున్నానని నాతో చెప్తే ఏం పోయింది. ఆయన ఇష్టాయిష్టాలు నాకు సాఫ్ సీదాగా చెప్పవచ్చు గదా! ఎందుకు ఈ దాపరికం! మొన్న పాపకు ఎర్రరంగు ఫ్రాకు వేసినప్పుడు ఎర్రరంగు ఫ్రాకు ముద్దుగా వుంది పాప ఒంటి మీద అని మురిసిపోయాడు. అయితే ఆయనకు ఎర్రరంగు ఇష్టమన్నమాట!... అంతెందుకు నాకు పచ్చరంగు ఇష్టం. నా ఇష్టం ఆయనముందు ఎప్పుడైనా దాచిపెట్టానా?... మరి ఆయనెందుకు ఈ విధంగా దాచిపెట్టాలి!

ఆరోజు జానకిరాములు ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. మొత్తం తడిసిపోయాడు. తెల్ల అంగీ!... తెల్ల అంగీయే వుంది ఆయన ఒంటి మీద. అది తడిసి ముద్దయిపోయింది.

"జల్లి బట్టలు మార్చుకోండి. సర్దీ జ్వరం వస్తాయి.." అంది సీత.

జానకిరాములు బాత్రూంలోకి పోయి తెల్ల అంగీ విప్పాడు. అప్పుడే సీత తువ్వాలుతో బాత్రూంలోకి వచ్చింది. జానకిరాములు శరీరానికి అతుక్కుపోయి ఎర్రరంగు అంగీ!.... సీత ఆశ్చర్యపోయింది. అవాక్కయిపోయింది. "ఈయనకు ఎర్రరంగు ఎప్పట్నుంచి ఇష్టం!... దాంతో భర్త వ్యక్తిత్వమే పూర్తిగా మారిపోయి ఆమెముందు నిలబడ్డాడు. ఈయన ఇన్నాళ్లు ఎందుకు దాచిపెట్టాడు ఈ విషయం! ఒక్కసారి మాటవరసక్కూడా ఆయన తన ఇష్టాయిష్టాలు తనతో చర్చించలేదు..." ఆలోచనలతో సీత గుండె అంతా ఖాళీతనంతో నిండిపోయింది. తాను అరణ్యవాసానికి తోలివేయబడిన సీతలాగా అనిపించింది ఆమెకు.

"ఒక్కమాట... ఒక్కమాట తనతో చెప్పొచ్చు గద తనకు! ఎర్రరంగు అంగీ అంటే ఇష్టమని ... అతనికి తెల్ల అంగీల బదులు ఎర్రరంగు అంగీలనే పట్టించేదాన్ని. ఈ ఎర్రరంగు అంగీలను ఎవరు ఉతుకుతున్నారు మరి! ఆయనే బాత్రూంలో ఉతుక్కుని రహస్యంగా ఎక్కడో ఆరేసుకుంటున్నాడా?... ఎందుకు ఈ దాపరికం! నాకు తెలిస్తే నేనే ఎర్రరంగు అంగీని ఉతికేదాన్ని. ఆరేసి ఇస్త్రీ చేసి పెట్టేదాన్ని... ఎందుకిట్లా ఈయన దీన్నంత దాచిపెట్టారు! నన్ను దూరంగా ఉంచాడు!..." సీత తువ్వాలుతో వెనకకు తిరిగి హాల్లోకి వచ్చింది.

జానకిరాములు బయటకి వచ్చాడు. తెల్ల అంగీలో!...

సీత కండ్లన్నీ విప్పార్చి చూసింది.

"మీరు!... మీరు.... ఎర్రరంగు అంగీని పిండి ఎక్కడ ఆరేసారు?" అడిగింది. ఆమె గొంతు నిమ్మళంగా ఏ భావావేశం లేకుండా ఉంది. జానకిరాములు బిత్తరపోయాడు.

"నువ్వు చూశావా?"

"ఊఁ..." తలూపింది సీత.

"అంతకుముందు వాళ్లూ వీళ్లూ చెప్తుంటే విన్నాను. ఇప్పుడు చూశాను నా కండ్లతో. ఇదంతా మీరు నా దగ్గర ఎందుకు దాచారు?" సీత కండ్లల్లో నీళ్లు నిండాయి.

"నువ్వు ఇష్టపడ్తావో... లేదో... అని..."

"అంటే కుటుంబాన్ని మీనుంచి దూరం వుంచారు. ఇదంతా దాచి పెట్టారు. అయ్యో!... మీకు ఎర్రరంగు ఇష్టమని తెలిస్తే నేనూ ఎర్రబట్టలే వేసుకునేదాన్నండీ!... ఈ విషయం ఒక్కసారైనా మీరు మాకు చెప్పారా?..." బోరున ఏడ్చింది సీత.

"ఏడ్పు.... ఎందుకు?... ఇంతదానికి..." జానకిరాములు మెల్లగా అన్నాడు.

"మీకు 'ఇంత' గానే అనిపిస్తుంది. కుటుంబంలోని వాళ్లను దూరంగా ఉంచి ఏం సాధించాలనుకున్నారు? మీకు కుటుంబజీవితం వేరు పబ్లిక్ జీవితం వేరూ! అయిపొయాయి. మాకు తెలిస్తే తెలియజెప్పితే మేమూ మీతో సహకరిస్తామని ఎందుకనుకోలేదు! ఆడవాళ్లకేదీ అర్థం కాదు... చేతకాదు... అనుకున్నారా? అంతేనా?... ఆడవాళ్లను ఎంత తక్కువ అంచనా వేసారు మీరు!..." ఏడ్చింది సీత పైట కొంగు ముఖానికి పెట్టుకుని.

జానకిరాములు అలాగే నిలబడిపోయాడు. ఏం చెప్పకుండా చేయకుండా రాముడు సీతను అరణ్యవాసం పంపించినప్పుడు లక్ష్మణుని ముందు ఆమె ఈ విధంగానే మనస్సులో మెరుపులా ఆ దృశ్యం కన్పించింది

"సీతా!... నీకు చెప్పకపోవడం నాది తప్పే! ఇప్పట్నుంచి ఇక మన మధ్య ఏ దాపరికాలుండవు! నిజం చెప్తున్నాను. నన్ను క్షమించు సీతా! ఇక మీద మనం నిజంగా అన్నివిధాలా సహచరులం!..." జానకిరాములు సీతను దగ్గరికి లాక్కొని కౌగిట్లో బంధించాడు. ■

